www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 22 మే 2025

5

వైఎస్‌ఆర్

ఎండియు వాహనాలను కొనసాగించాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రజలకు రేషన్ బియ్యాన్ని ఇంటి వద్దకు అందజేస్తున్న ఎండియు వాహనాలను కొనసాగించాలని తహశీల్దార్ నాగేశ్వరావును ఆపరేటర్లు కోరారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎండియు ఆపరేటర్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు 2027 వరకు గత ప్రభుత్వం వాహనాలను రేషన్ కార్డుదారులకు ఇంటి వద్దకు బియ్యం ఇచ్చేలా అనుమతి ఇచ్చిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తమను తొలగించాలని కేబినెట్ నిర్ణయం తీసుకోవడం సరైంది కాదన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో మండలంలోని 8 మంది ఎండియు ఆపరేటర్లు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటిలో ప్రవేశాలకు దరఖాస్తుల వెల్లువ

- 4,400 సీట్లకు 48,850 దరఖాస్తులు
- ఒక సీటుకు 12 మంది పోటీ
- 6న తొలి జాబితా ప్రకటన
- 11 నుంచి 17 వరకు అడ్మిషన్లు

ప్రజాశక్తి - వేంపల్లె

ఆంధ్రప్రదేశ్ లోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్‌జియుకెటి) పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఉన్న 4,400 సీట్లకు పదోతరగతి పాస్ అయిన విద్యార్థులు పోటా పోటీగా దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో విద్యార్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఆన్ లైన్‌లో వచ్చిన దరఖాస్తులను బట్టి చూస్తే ఒక సీటుకు 12 మంది చొప్పున పోటీ పడుతున్నారు. ఆర్‌జియుకెటి పరిధిలోని ఇడుపులపాయ, ఒంగోలు, నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటిలకు సంబంధించి మొత్తం 48,850 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారు 27,680 మంది, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు 21,170 మంది ఉన్నారు. నాలుగు ట్రిపుల్ ఐటిలకు సంబంధించి ప్రత్యేక కేటగిరి సంబంధించిన విద్యార్థులకు ఈనెల 28 నుంచి 31 వరకు నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ ఉంటుందని ఆర్‌జియుకెటి అడ్మిషన్స్ కన్వీనర్ అమరేంద్ర కుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థుల తొలి జాబితాను జూన్ 6న ఆర్‌జియుకెటి అధికారులు ప్రకటించనున్నారు. అదే నెల 11 నుంచి 17 వరకు మొదటి విడత అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుందని తెలిపారు. జూన్ ఆఖరి నాటికి ప్రవేశాలు పూర్తి చేసి జులై మొదటి వారంలో తరగతులు ప్రారంభించే అవకాశం ఉందని చెప్పారు. నాలుగు ట్రిపుల్ ఐటిలో 13 ఉమ్మడి జిల్లాల వారికి సమానంగా సీట్లు కేటాయిస్తామన్నారు. అయితే ఈ ఏడాది పదవ తరగతిలో వచ్చిన మార్కులు ఆధారంగా ప్రవేశాలు నిర్వహిస్తామన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు నాలుగు శాతం డ్రిప్రివేషన్స్ స్కోరును జోడించి అభ్యర్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు. కావున ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎక్కువ సీట్లు దక్కే అవకాశం ఉంటుందని చెప్పారు. ఏప్రిల్ 27 నుండి ఈనెల 20 వరకు దరఖాస్తులు చేసుకోవడానికి ట్రిపుల్ ఐటీ అధికారులు అవకాశం ఇచ్చారు. దరఖాస్తులు చేసుకునేందుకు ఆఖరు రోజునైనా మంగళవారం సర్వర్ బిజీగా ఉండడంతో కొంతమంది విద్యార్థులు పేమెంట్లు చెల్లించలేకపోయారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆర్‌జియుకెటి అధికారులు రాత్రి 12 గంటల వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు దారుణం

- స్థాయి సంఘం సమావేశంలో జడ్‌పి చైర్మన్ రామగోవిందరెడ్డి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని ఉపాధి హామీ ఫీల్డ్‌అసిస్టెంట్లను పెద్దసంఖ్యలో తొలగించడం దారుణమని జడ్‌పి చైర్మన్ ముత్యాల గోవిందరెడ్డి పేర్కొన్నారు. బుధవారం చైర్మన్ కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో 65 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా తొలగించడం తగదన్నారు. ఒకవేళ ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పిదాలకు పాల్పడితే ఉపాధి హామీ ఎపి, సిబ్బంది కూడా బాధ్యులే అవుతారని, తప్పిదానికి సహకారం అందించిన ఉపాధిహామీ సిబ్బందిపై కూడా చర్యలు తీసుకో వాలన్నారు. ఉపాధి హామీ ఉద్యోగులకు ఒక న్యాయం, ఫీల్డ్ అసిస్టెంట్లకు మరొక న్యాయమా అని నిలదీశారు. అవివేకపు చర్య వల్ల ఉపాధి హామీ పనులు మందగమనంలో సాగుతున్నాయన్నారు. తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్ల స్థానంలో మరొకరిని తీసుకోకుండా, ఉపాధి హామీ మేట్లపై ఆధారపడిన కారణంగా ఉపాధి హామీ కార్మికులకు అన్యాయం జరుగుతోందని తెలిపారు. పోరుమామిళ్ల జడ్‌పిటిసి ముత్యాల చెన్నయ్య మాట్లాడుతూ పింఛన్ల రీఅసెస్మెంట్ చర్య కారణంగా వైద్య సేవలకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. పోరుమామిళ్ల హాస్పిటల్‌లో 14 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా ఐదుగురు మాత్రమే ఉన్నారని వాపోయారు. ఏడాది కింద ఎక్స్‌రే యంత్రం ఏర్పాటు చేసినప్పటికీ నిరుపయోగంగా మారిందని తెలిపారు. 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పింఛన్ల పంపిణీ ఏమైందని ప్రశ్నించారు. జిల్లాలోని కో-ఆపరేటివ్ బ్యాంకులు వ్యవసాయ రుణాలు మంజూరు చేయకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. తర్వాత నెడ్‌క్యాప్ అధికారి యల్లారెడ్డి మాట్లాడుతూ పిఎం సూర్యఘర్ పథకం కింద ఆదర్శ సోలార్ పథకం కింద గోపవరం, సికెదిన్నె, పోరుమామిళ్ల, సుగమంచిపల్లి గ్రామాలు ఎంపికయ్యాయన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఐదు వేల మంది జనాభా కలిగిన ఆదర్శ గ్రామాలకు కేంద్రం రూ.కోటి మంజూరు చేస్తుందని తెలిపారు. ఎస్సి, ఎస్‌టిలకు 200 యూనిట్ల మేరకు ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు. జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు కరీముల్లా మాట్లాడుతూ ఖాజీపేట యునాని ఆస్పత్రి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయని, జిల్లా పరిషత్ సమావేశాల్లో ప్రస్తావిస్తున్నప్పటికీ ఎటువంటి ఉపయోగమూ లేకుండా పోయిందని వాపోయారు. చైర్మన్ కలుగజేసుకుని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఖాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్ సంబంధించిన రూ.20 లక్షలు మురిగిపోతున్నాయని, వాటిని హైస్కూల్ అభివృద్ధికి వెచ్చించాలని సూచించారు. జిల్లాలో నాడు-నేడు కింద పలు పాఠశాలల భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయని, వా టిని పూర్తి చేయడంపై దృష్టి సారించాలన్నారు. దీనికి ఎస్‌ఎస్‌ఎ పిఒ స్పందించి కెజిబివి పరిధిలోని అసంపూర్తి నిర్మాణాలపై నివేదికను ప్రభుత్వానికి అందజేశామన్నారు. గైడ్‌లైన్స్ వచ్చిన వెంటనే అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు జడ్‌పిటిసిలు, ఉమ్మడి జిల్లాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కేసులను త్వరితగతిన పరిష్కరించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - బద్వేలు : రెవెన్యూ డివిజనల్ అధికారి ఎ.చంద్రమోహన్ అధ్యక్షతన డివిజనల్ లెవెల్ ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సమావేశం బద్వేల్ రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారి డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న 20 పోలీసు కేసులను త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని పోలీసు శాఖ వారిని ఆదేశించారు. ఇందుకు సంబంధించి అవసరమైన క్యాస్ట్ సర్టిఫికెట్లను డివిజన్లోని తహశీల్దార్లు త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. ప్రతినెల 30న అందరూ తహశీల్దార్లు సివిల్ రైట్స్‌డే నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైనటువంటి సభ్యులందరికీ ఆర్‌డిఒ శుభాకాంక్షలు తెలియజేశారు.

రుణాలు రెన్యువల్ చేయండి : ఎంపీ

ప్రజాశక్తి -పులివెందులటౌన్

రైతుల పై భారం పడకుండా క్రాప్ లోన్లు రెన్యువల్ చేయాలని కడప పార్లమెంటు సభ్యుడు వై.ఎస్.అవినాష్ రెడ్డి బ్యాంక్ అధికారులను కోరారు. బుధవారం పట్టణ ంలోని ఎస్‌బిఐ బ్యాంకుకు వెళ్లి బ్యాంక్ అధికారులతో మాట్లాడారు. గత ఏడాది క్రాప్ లోన్ రెన్యువల్స్ సమయంలో రైతులతో డబ్బులు కట్టించుకొని రెన్యువల్ చేయకుండా బ్యాంకు అధికారులు అలసత్వం వహించారన్నారు. ఇప్పుడు రైతులపై అధిక వడ్డీ భారం బ్యాంక్ అధికారులు మోపడం సరికాదన్నారు. అనంతరం ఆయన కడప రీజినల్ మేనేజర్‌తో ఫోన్ లో మాట్లాడి రైతుల మీద ఒక రూపాయి కూడా భారం పడకుండా రుణాలు రెన్యువల్ చేయాలని కోరారు. రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్, ఆర్‌బిఐ మార్గ దర్శకాల ప్రకారం రుణాలు పెంచాలని సూచించారు.

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని, ఎవరు ఆధైర్య పడకుండా ఉండాలని కడప పార్లమెంటు సభ్యుడు ఎంపీ అవినాష్ రెడ్డి కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌కు నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని వారి సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. అక్రమ కేసులకు, నాయకుల బెదిరింపులకు ఎవరు భయపడాల్సిన అవసరం లేదని ప్రతి ఒక్క కార్యకర్తకు అన్ని విధాల అండగా ఉంటామని చెప్పారు. ఎప్పటికీ అందుబాటులో ఉండి మీకు తోడుగా ఉంటామన్నారు. కార్యక్రమంలో వైయస్ మనోహర్ రెడ్డి వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రజాదర్బార్‌లో ప్రజా సమస్యలు వింటున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు

- మినీ మహానాడులో టిడిపి జాతీయ కార్యదర్శి బీద రవిచంద్ర

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న బీద రవిచంద్ర

జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలు అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని నాశనం చేస్తే, కడప ఎమ్మెల్యే అంజద్ బాషా, కార్పొరేషన్ మేయర్ కడపను సర్వనాశనం చేశారని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర తీవ్ర స్థాయిలో మండపడ్డారు. నగరంలోని మద్రాస్‌రోడ్‌లో రాజరాజేశ్వరి కళ్యాణ మండపంలో బుధవారం కడప నియోజకవర్గ మినీ మహానాడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా టిడిపి జాతీయ కార్యదర్శి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ కడపలో టిడిపి గెలవకపోయినా చంద్రబాబు నిధులు ఇచ్చారని గుర్తు చేశారు. కడపను అభివృద్ధి చేసి చూపిస్తానని చెప్పి, గెలిచిన ఎమ్మెల్యే మాధవి పట్టుబట్టి సిఎం నుంచి అభివృద్ధి పనులకు రూ.80 కోట్ల నిధులు తెచ్చారని చెప్పారు. కడప నీటి సమస్య శాశ్వతంగా తీర్చేందుకు రూ.500 కోట్లు తెచ్చేలా చంద్రబాబుతో ఎమ్మెల్యే చర్చించారని పేర్కొన్నారు. రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు, కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రెండు బ్రిడ్జిలు నిర్మాణానికి జీవోలు తెచ్చామని, టెండర్లు జరగాల్సి ఉందన్నారు. గతంలో అధికారంలో ఉన్న రెండు పార్టీలు ఎందుకు చేయలేకపోయాయని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలవాలని ఎంతమంది టికెట్ ఆశించినా ఒక్కరికే అవకాశం వస్తుందన్నారు. టిడిపిలో ఉండి ఎన్నికల్లో వైసిపికి ఓటు వేయాలన్న నాయకుని చరవాణి సంభా షణలు, స్క్రీన్ పై చూపించి, ఇటువంటి పార్టీ ద్రోహులను సిఎం దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకోవాలని బీద రవీచంద్రను కోరారు. పార్టీ కష్టపడ్డ కార్యకర్తలకు తప్పక న్యాయం జరుగుతుందన్నారు. మహానాడు మూడు రోజులు కడప పసుపుమయంగా మారుతుందన్నారు. ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ టిడిపి కండువాలు వేసుకుని, వైసిపి నాయకులతో చేతులు కలిపి, ఆ పార్టీకి ఓటు వేయాలని చెప్పడం పార్టీకి ద్రోహం చేయడమే అన్నారు. అటువంటి వారిని పార్టీలోకి రానివ్వకుండా, పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు అండగా ఉండి, అభివృద్ధికి కట్టుబడి ఉంటామన్నారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్, హరి ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో పత్తిపాటి కుసుమకుమారి, డివిజన్, బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుటుంబ ప్రతిష్టను దిగజార్చడం

ఎవరికీ సాధ్యం కాదు

- టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మీరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

తమ కుటుంబ ప్రతిష్టను దిగజార్చడం ఎవరికీ సాధ్యం కాదని టిడిపి సీనియర్ నాయకులు, జడ్‌పి మాజీ వైస్ చైర్మన్ అలంఖాన్‌పల్లి లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైఎస్‌ఆర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప నియోజకవర్గ టిడిపి మినీ మహానాడు కార్యక్రమంలో తమ నకిలీ ఆడియో, వీడియో సృష్టించి వైసిపి అనుకూలంగా ప్రచారం చేశారని కార్యకర్తలకు వినిపించడంవిడ్డూరంగా ఉందని అన్నారు. 1996 నుంచి 2025వరకు తెలుగుదేశం పార్టీకి అంకితభావంతో పనిచేశామని అన్నారు. 30 సంవత్సరాల నుంచి అలంఖాన్‌పల్లిలో ఓటమి లేకుండా గెలిచామన్నారు. టిడిపిని ఓడించాలని వీరోచితంగాను, అన్ని శక్తులను ఉపయోగించి మమ్మల్ని అణగదొక్కాలని చూశారని అన్నారు. పార్టీ కార్యకర్తలు, మా కుటుంబ కష్టం వలన, టిడిపి అండదండల వల్ల ఓటమి అనేది లేకుండా గెలుపొందామన్నారు. ఇప్పుడు వచ్చిన కడప ఎమ్మెల్యే మాధవి, శ్రీనివా సరెడ్డి లేనిపోని ఆరోపణలు మాపై సృష్టించి ప్రజల్లో , కార్యకర్తలకు మధ్య గందరగోళం సృష్టించి ఏదో లబ్ధి పొందాలని చూడటాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. మేము ఎప్పటికీ పార్టీ విధేయులమేనని అన్నారు. టిడిపి కార్పొరేటర్ ఉమాదేవి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కోసం మా కుటుంబం ఎన్నో కష్టాలను, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నామని అన్నారు. అది .కారికంగానూ ఎంతో అణచివేయబడి, ఎన్నో కేసులను ఎదుర్కొంటున్నామని తెలిపారు. మమ్మల్ని కించపరచడం మీకు ఆనందం అనుకుంటే అది మీ విజ్ఞతకే వదిలేస్తున్నామని చెప్పారు. మహానాడును కడప జిల్లాలో నిర్వహించడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడుకు అందరిని కలుపుకొని పోవాలని కానీ కార్యకర్తలను, ప్రజలను వేరు చేయడం, అక్కడక్కడ దాడులు చేయించడం మంచి పరిణామం కాదని అన్నారు. అధికారాన్ని ఉపయోగించి ప్రజలను అణగదొక్కాలని చూడటం రాక్షస ఆనందమే తప్ప నాయకుల లక్షణం కాదని అన్నారు. ఎమ్మెల్యే మాధవి, వాసు ఇప్పటికైనా నిజాలు తెలుసుకోవాలని, కడపలో తెలుగుదేశం పార్టీకి పనిచేసేది తామేనని, వెనకడుగు వేసే ప్రసక్తే లేదని అన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీరెడ్డి

'కౌలు'కు గుర్తింపేదీ?

కౌలురైతు గుర్తింపుకార్డుల మంజూరు నత్తనడకన సాగుతోంది. 2025-26 ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్నప్పటికీ సర్వే, రీసర్వే, సమావేశాల పేరుతో జిల్లా వ్యవసాయ శాఖ మీనమేషాలు లెక్కిస్తోంది. ఫలితంగా పంటల సాగుకు సంబంధించిన వ్యవసాయ రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం వంటి సదుపాయాలను కౌలురైతు కోల్పోవాల్సి వస్తోంది. వ్యవసాయశాఖ నిర్లక్ష్యం కారణంగా వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. రూ.మూడు చొప్పన వడ్డీకి అప్పులు తీసుకుని వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో చిక్కుకుపోతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది.

సర్వేలతోనే కాలయాపన
700 మందికి గుర్తింపు కార్డులు
కార్డుల మంజూరులో వెనుకడుగే

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో సుమారు 40 వేల మంది కౌలురైతులు ఉన్నట్లు అంచనా. జిల్లా వ్యవసాయ శాఖ 10 వేల మందికి గుర్తింపు కార్డులు అందించడంపై దృష్టి సారించింది. ప్రకృతి వైపరీత్యాలను అధిగమిస్తూ ఎన్నోవ్యయ ప్రయాసల కోర్చి పంటలు సాగు చేస్తున్నారు. ప్రతి ఏటా తరుచుగా ప్రకృతి విపత్తులు చోటు చేసుకోవడం పరిపాటి. ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో పంట నష్టాలు సంభవించడం పరిపాటి. నష్టాల బారిన పడిన కౌలురైతులకు నష్ట పరిహారం అందించాలంటే గుర్తింపు కార్డులు తప్పనిసరి. వీటిని క్రాఫ్ కల్టివేషన్ రైట్ కార్డులు (సిసిఆర్‌సికార్డు) అంటారు. ప్రభుత్వపరమైన సహాయం పొందడానికి అవకాశం ఉంటుంది. మార్కెట్లలో వ్యవసాయ ఉత్పత్తులను క్రయవిక్రయాలకు సిసిఆర్‌సి కారుల అవసరం ఉంటుంది. కీలక గుర్తింపు కార్డుల పంపిణీ ప్రక్రియ నత్తన డకన సాగుతోంది. ఇప్పటికే వర్షాభావంతో రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. పంట పరిహారం పొండడానికి సిసిఆర్‌సి కార్డుల ద్వారానే సాధ్యమ వుతుంది.

నత్త నడకన సర్వే...రీసర్వే

జిల్లాలోని కౌలురైతుల గుర్తింపు సర్వే, రీసర్వేల దశలోనే ఉంది. 2025-2026లో 11 వేల సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేయడం జిల్లా వ్యవసాయశాఖ లక్ష్యం. 2024-2025 సంవత్సరంలో 10 వేల మందికి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాల్సి ఉండగా ఎల్‌పిఎం కార్డులతో కలిపి 10,500 గుర్తింపుకార్డులు మంజూరు చేసింది. 2025-26 సంవత్సరంలో 10 వేల మంది కౌలురైతులకు గుర్తింపు కార్డులు అందించాలనే లక్ష్యంలో భాగంగా 700 మందికి మాత్రమే గుర్తింపు కార్డులు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. మిగిలిన 13,300 మంది కౌలురైతుల గుర్తింపు దశలోనే ప్రక్రియ సాగుతుండడం గమనార్హం. ఈలెక్కన ఖరీఫ్ సీజన్ ముగింపు దశ నాటికి సైతం లక్ష్యాన్ని అధిగమించడం గగనమేననే విమర్శవినిపిస్తోంది. జిల్లా వ్యవసాయశాఖ 4,856 మంది కౌలురైతులకు సిసిఆర్‌సి కార్డులకు సర్వే నిర్వహించింది. ఎల్‌పిఎం (ల్యాండ్ పార్శిల్ సర్వే నెంబర్ల) ఆధారంగా రీసర్వే చేసిన అనంతరం 4,373 కార్డులను మంజూరుకు అర్హులను గుర్తించిన అనంతరం 9,229 కార్డులను పంపిణీ చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వాలు శ్రద్ధ కొరవడిన నేపథ్యంలో సిసిఆర్‌సి కార్డుల మంజూరు ప్రక్రియ నత్తనకడన సాగు తుండడం ఆందోళన కలిగిస్తోంది.

సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేయండి

కౌలు రైతులకు సకాలంలో గుర్తింపు కార్డులు ఇవ్వాలి. జిల్లా వ్యవసాయశాఖ నిర్లక్ష్యం కారణంగా మూడు వంతుల మంది కౌలు రైతులు నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎరువులు, పురుగు మందులు, పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర అవకాశాలను కోల్పోవాల్సిన దుస్థితి దాపురించింది.

- దస్తగిరిరెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి. కడప.

యోగా దినచర్యలో భాగస్వామ్యం కావాలి

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - కడప

యోగా తోనే సర్వ మానవాళికి ఆరోగ్య యోగం సిద్ధిస్తుందని దైనందిన జీవితంలో యోగా భాగస్వామ్యం కావాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కడప ఇండోర్ స్టేడియంలో కర్టెన్ రైసర్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్‌తోపాటు ఎస్‌పి అశోక్‌కుమార్, జెసి అదితిసింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా 'యోగా మంత్' నేటి నుంచి మొదలైందన్నారు. యోగాంధ్ర క్యాంపెన్ -2025 లో భాగంగా ఈనెల 21 నుండి జూన్ 21 వరకు నిర్వహిస్తున్న ఈ మాసోత్సవాల్లో యోగా చేయడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను విశదీకరించారు. ఈ నేపథ్యంలో ఒక యాప్‌ని కూడా ప్రారంభించామని, ఆ యాప్‌లో అందరూ రిజిస్టర్ కూడా కావచ్చని పేర్కొన్నారు. ప్రజలంతా పెద్ద ఎత్తున ఈ యాప్‌ను ఉపయోగించాలన్నారు. ఎస్‌పి అశోక్ కుమార్ మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ యోగాసనాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. యోగా ఆసనాలు వేయడం ద్వారా క్రమశిక్షణ, మెరుగైన జీవన విధానం అలవడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగాని నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని, యోగాంధ్ర కార్యక్రమాల్లో జిల్లా యంత్రాంగం, ప్రజలు విస్తృతంగా భాగస్వామ్యం కావాలన్నారు. జెసి అదితిసింగ్ మాట్లాడుతూ నేటి ఉరుకులు, పరుగుల జీవనంలో చదువులు, ఇళ్లలో పనులు, ఆఫీసుల్లో ఒత్తిళ్ల కారణంగా ఎంతో మంది అనేక శారీరక, మానసిక ఆరోగ్య రుగ్మతలను ఎదుర్కొంటున్నారన్నారు. అనంతరం కలెక్టర్ యోగాసనాలు వేసి అందరిలోనూ స్ఫూర్తి నింపారు. జిల్లా ఎస్‌పి, జెసి, వివిధ శాఖల జిల్లా అధికారులు కూడా యోగాసనాలు వేశారు. యోగా మాస్టర్‌లు ప్రోటోకాల్ ప్రకారం యోగాసనాలను చేయించారు. కార్యక్రమంలో కెఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, డిపిఒ రాజ్యలక్ష్మి, డిఎంహెచ్‌ఒ డాక్టర్ నాగరాజు, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, జిల్లా అధికారులు, ఆయుష్ సిబ్బంది, పాల్గొన్నారు.

పోసస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి , అధికారులు

కడప అర్బన్ : అంతర్జాతీయ యోగా దినోత్సవం, యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో 'కామన్ యోగా ప్రోటోకాల్' పోస్టర్ కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన జీవితాన్ని మనమే ఆరోగ్యంగా తీర్చిదిద్దుకోవాలి, ఇందుకు ఉపకరించే విద్య యోగా విద్య అన్నారు. మనిషి వ్యక్తిత్వ వికాసానికి, శారీరక, మానసిక ఎదుగుదలకు యోగ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శేఖర్ రాజు, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్.మురళీబాబు, రామ్మూర్తి, యోగా తెరపిస్ట్ పెంచల ప్రసాద్, యోగాన్ని ఫుల్ డాక్టర్ రంగనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

పచ్చదనాన్ని పెంపొందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

జిల్లా అభివృద్ధిలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా 20 లక్షలు మొక్కలు నాటాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని బోర్డు రూం హాల్లో డిఎఫ్‌ఒ వినీత్ కుమార్‌తో కలిసి మొక్కల పెంపకం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ. జిల్లాలో రెండు దశలలో జూన్ 27న పది లక్షల మొక్కలు, ఆగస్టు 29 న పదిలక్షలు మొక్కల పెంపకం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేసేలా, మొక్కలు నాటే కార్యక్రమాన్ని శరవేగంగా పూర్తి చేసేందుకు తగు కార్యాచరణతో ముందుకు సాగాలని అన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో లక్ష్యానికి చేరువగా అడుగులు వేయాలన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ప్రతి ఇంటికి పండ్ల మొక్కలను పంపిణీ చేయాలని సూచించారు. ప్రకృతి సమతుల్యత పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కార్యక్రమానికి సామాజిక అటవీ సంస్థ వారు మొక్కలు పంపిణీ చేయాలని, జిల్లా గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద పనులు చేపట్టాలని ఆదేశించారు. ఇందులో అధికారులను, ప్రజలను, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేయాలన్నారు. రహదారుల పక్కన, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ సంస్థల కార్యాలయాల్లోనూ, చెరువు గట్టులు,ప్రభుత్వ భూములు వంటి అనుకూల ప్రాంతాలలో మొక్కలను విరివిగా నాటేందుకు సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ రాజ్యలక్ష్మి, డిపిఒ రాజ్యలక్ష్మి, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, జిల్లా పర్యాటకశాఖ అధికారి సురేష్, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వక్ఫ్‌పై కరపత్రం విడుదల

ప్రజాశక్తి - కడప

'వక్ఫ్ చట్ట సవరణలు'పై ఎఐసిసి కో-ఆర్డినేటర్ రూపొందించిన కరపత్రాన్ని బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్.ఎ. సత్తార్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, నగర కో-ఆర్డినేటర్‌బండి జకరయ్య మాట్లాడుతూ వక్ఫ్ చట్ట సవరణలపై దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలు నిర్వహిస్తున్నారని, ఇప్పటికే బిజెపి ప్రభుత్వం ముస్లిములకు వ్యతిరేకంగా తాను అధికారంలోకి వచ్చినప్పటి నుండి అనేక చట్టాలు చేసిందన్నారు. అందులో ట్రిపుల్ తలాక్, కాశ్మీర్లో ఆర్టికల్ 370, ఉమ్మడి పౌరస్మృతి, సిఎఎ, ఎన్‌ఆర్‌సి, ఎన్‌పిఆర్, లాంటి చట్టాలు చేసి మళ్లీ ఇప్పుడు వక్ఫ్ సవరణ చట్టాలు చేసిందని పేర్కొన్నారు. ఈ చట్టం గురించి సెక్యులర్ వాదులు, ముస్లిం సోదరులు అనేక ఉద్యమాలు చేస్తున్నప్పటికీ, దీనిపై అందరికీ సరైన అవగాహన కల్పించేందుకు అందరికీ అర్థమయ్యేలా సరళమైన భాషలో తెలియజేయాలని ఉద్దేశంతో కరపత్రం వేశామన్నారు. ఉద్యమం కొనసాగించడానికి ఇదొక ఆయుధం లాగా ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా మాజీఅధ్యక్షులు నజీర్ అహమ్మద్, నగర మైనారిటీ సెల్ అధ్యక్షులు ఆసిఫ్ ఖాన్, అక్రమ్, నాసిర్ హుస్సేన్, బిసి సెల్ అధ్యక్షులు కులయప్ప పాల్గొన్నారు.

పనుల్లో పురోగతి సాధించాలి : ఎస్‌ఇ

ప్రజాశక్తి - కడప

ఆర్‌డిడిఎస్ పథకం కింద పనులు చాలా నెమ్మదిగా సాగుతున్నాయని, పనుల్లో పురోగతి సాధించాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ అన్నారు. కడప విద్యుత్ భవన్‌లో ఆర్‌డిడిఎస్ పథకం కింద జరుగుతున్న పనులపై తన ఛాంబర్‌లో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌డిడిఎస్ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో త్రీఫేస్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలియజేశారు. ఈ పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో పరిశ్రమల ఏర్పాటుకు మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా నిరంతర నాణ్యమైన త్రీఫేస్ విద్యుత్ ఏర్పడి సులభతరం అవుతుందని తద్వారా పట్టణాలకు దీటుగా గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని తెలియజేశారు. పనులలో వేగవంతం పెంచాలని తద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు త్వరగా లబ్ధి చేకూరాటమే కాకుండా విద్యుత్ వ్యవస్థ పటిష్టవంతంగా తయారవుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగరాజు, డిఇఇలు, ఎఇలు, గుత్తేదారులు పాల్గొన్నారు.

ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

విభిన్న ప్రతిభావంతులు వారికి అందించిన ప్రత్యేక ఉపకారణాలను సద్వినియోగం చేసుకోవాలని జోన్ 4 పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు శామ్యూల్ సూచించారు. బుధవారం సమగ్ర శిక్ష కార్యాలయ ఆవరణలో ఉపకారణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అలింకో ఉపకరణాలను తయారు చేసి అందిస్తోందని తెలిపారు. వీటిని సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో అర్హులను గుర్తించి అందిస్తుందని చెప్పారు. ప్రభుత్వం విభిన్న ప్రతిభావంఉలకు అందించిన ఉపకారణాలను సద్వినియోగం అయ్యేలా వారి తల్లిదండ్రులు, ప్రత్యేక ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో- ఆర్డినేటర్ నిత్యనంద రాజులు, విభిన్న ప్రతిభవంతుల శాఖ జిల్లా సంచాలకులు కృష్ణ కిషోర్లు మాట్లాడుతూ ఉపకారణాలు విభిన్న ప్రతిభావంతులు తమ లోపాలను అధిగమించి పురోగమించడానికి అవకాశం కల్పిస్తాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌జెడి కార్యాలయ ఎడి విజయ కుమార్, సమగ్ర కో - ఆర్డినేటర్ రమణమూర్తి, కేశవరెడ్డి, విశ్వనాథరెడ్డి, వీరేంద్ర, ఐఇఆర్‌పిలు మమత, విజయమ్మ, పద్మ, గంగులప్ప, చంద్ర, రాజా పాల్గొని అర్హులకు వీల్ చైర్స్, సిపి చైర్స్, రోలేటర్స్ అందించారు.

ఉపకరణాలు అందజేస్తున్న ఆర్‌జెడి

రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

రాజీవ్‌గాంధీ గొప్ప దార్శనికుడు
- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

మాజీ ప్రధాని, భారత రత్న రాజీవ్ గాంధీ గొప్ప దార్శనికుడు, రాజనీతిజ్ఞుడని పిసిసి అధికార ప్రతినిధి ఎన్ తులసి రెడ్డి, పులివెందుల అసెంబ్లీ నియోజక వర్గ సమన్వయ కర్త ధృవకుమార్ రెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో రాజీవ్ గాంధీ 34వ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1985 నుంచి 1991 వరకు 6 సంవత్సరాల పాటు ఎఐసిసి అధ్యక్షులుగా, 1984 నుంచి 1989 వరకు 5 ఏళ్ల పాటు భారత ప్రధానిగా అటు కాంగ్రెస్ పార్టీకి, ఇటు దేశానికి రాజీవ్ గాంధీ ఎనలేని సేవ చేశారన్నారు. జాతి నిర్మాణంలో యువతకు ఎక్కువ ప్రాధాన్యత కల్పించాలన్న ఉద్దేశంతో ఓటు కనిష్ట వయో పరిమితిని 21 సంవత్సరాల నుంచి 28 సంవత్సరాలకు తగ్గించిన యువత పక్షపాతి రాజీవ్ అన్నారు. స్థానిక సంస్థలలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించి మహిళా సాధికారితకు కృషి చేసిన మహిళా పక్షపాతి అన్నారు. 73,74 రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల కు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించి పూజ్య బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి బాటలు వేసిన దార్శనికుడు అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం, వేంపల్లె, వేముల, పెండ్లిమర్రి, చక్రాయపేట మండల శాఖ అధ్యక్షులు రామకృష్ణ, వెంకటేష్, మహబూబ్ బాషా, రామాంజనేయరెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, రమణ, వినయ్, బద్రి, వేమయ్య, వేమా రాజా, మదార్, రవి, సాయి, చందు పాల్గొన్నారు **కడప :** దేశ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ 34వ వర్ధంతిని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో డిసిసి ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ భారతీయ యువత సాధికారత కోసం తీసుకున్న కట్టుబాట్లను, సాంకేతిక రంగ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని, పంచాయితీరాజ్ వ్యవస్థలను బలోపేతం చేసిన దిశగా ఆయన తీసుకున్న చర్యలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఒబిసి జిల్లా చైర్మన్ కుల్లాయప్ప, మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫీక్ ఖాన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ సత్తార్, శ్యామలమ్మ, హరిప్రసాద్, శీలం గంగయ్య పాల్గొన్నారు. **ఖాజీపేట :** మాజీ ప్రధాని, కీ.శే. రాజీవ్ గాంధీ 34వ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ కూడలిలో కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ జిల్లా మాజీ చైర్మన్ గున్నంపాటి వెంకటరమణ, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ హాజీ గౌస్, మహేష్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రధానిగా దేశానికి అందించిన సేవలు ఎనలేని వని వారు ఆయన సేవలను కొనియాడారు.

పందుల యజమానులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

పందుల యజమానులతో చర్చలు
- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీలో పందులను నివారించేందుకు అధికారులు కార్యాచరణ ప్రారంభించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో పందుల యజమానులతో సమావేశాన్ని నిర్వహించారు. బుధవారం ప్రజాశక్తిలో వెంటాడుతున్న పందుల బెడద అనే వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు మున్సిపాలిటీ పరిధిలోని పందుల యజమానులు, పెంపకందారులతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ పందుల యజమానులు వారి పందులను తీసుకెళ్లి పందుల దొడ్డిలో ఉంచుకొని పెంచుకోవాలని సూచించారు. పందుల యజమానులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. అవసరమైతే రెవిన్యూ అధికారులు పందుల దొడ్డి కొరకు స్థలాలు మంజూరు చేస్తారన్నారు. స్పందించకపోతే మున్సిపాలిటీనే పందులను పట్టించి దొడ్లకు తరలిస్తామన్నారు. వచ్చేది వర్షాకాలం కావడంతో పందుల వల్ల ప్రజలు అనేక రోగాలు బారిన పడే అవకాశం ఉందని యజమానులు గ్రహించి పందులను దొడ్లకు తరలించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డిటి అమరేశ్వరి, మెప్మా అధికారి కేజీయా జాస్మిన్, సిబ్బంది, పందుల యజమానులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉపవైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాజా మొద్దీన్ అన్నారు. బుధవారం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ స్నేహ ప్రత్యూష, డాక్టర్ శాంత కుమార్, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్యతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయి, కాబట్టి నీరు నిల్వలు ఉండే అవకాశం ఉందని, దానివల్ల దోమలు వృద్ధి చెంది జ్వరాలొస్తాయని పేర్కొన్నారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు అందరూ జాగ్రత్తగా ఉండి ఫీవర్, లార్వా సర్వేలు నిర్వహించి ఎక్కడైనా జ్వరాలు వచ్చినట్లయితే తమకు, సబ్ యూనిట్ ఆఫీసర్‌కు వైద్య సిబ్బంది తెలపాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి జ్వరం వచ్చిన వారిని దగ్గరిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చి రక్తపరీక్షలు చేయించి వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత చికిత్స చేయాలన్నారు.

మురుగునీటిని తొలగించేందుకు చర్యలు

ప్రజాశక్తి-లింగాల: మండల కేంద్రంలోని దిగువ లింగాల మసీదు వీధిలో మురుగునీరు నిల్వ చేరి వ్యాధులు వ్యాపిస్తున్నాయని, నీటిని తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని లింగాల సర్పంచ్ జూలువకర్, స్థానికులు ఇన్‌ఛార్జి ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శశివర్ణకు బుధవారం విన్నవించారు. ఏడాది నుంచి మసీదు వీధిలో ఆరుబయట నీటిని వదులుతున్నారని, పారబోయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మేరకు ఆమె బుధవారం సర్పంచ్‌తో కలసి గ్రామంలో పర్యటించారు. ఆరు బయట నీటిని వదులుతున్న వారికి నోటీసులు జారీ చేసినా తీసుకోలేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని, మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

టెన్నికాయిట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కడప: టెన్నికాయిట్ అసోసియేషన్ నూతన కమిటీని రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ఎన్.వి సత్యనారాయణ ప్రకటించారు. కడప నగరం లో బుధవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పి. రామసుబ్బారెడ్డి (వేంపల్లి) ప్రధాన కార్యదర్శిగా జి.వెంకట రమణారెడ్డి (పులివెందుల), కోశాధికారిగా వెనితర్ల రవిశంకర్ రెడ్డి (కడప)తో పాటు ఉపాధ్యక్షులుగా మచ్చ అంకన్న (లక్కిరెడ్డిపల్లె), సహాయ కార్యదర్శిగా మంజుల (రాయచోటి) ఎన్నికయ్యారు. సభ్యులుగా వీరబల్లి ఆంజనేయులు (రాయచోటి), సుజాత (వేముల)ను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ జిల్లాలో టెన్నికాయిట్ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

ఎంపిపి, జడ్‌పిటిసి నిధులతో
మండలాభివృద్ధి
- మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల వెల్లడి

సర్వసభ సమావేశంలో మాట్లాడుతున్న జడ్‌పిటిసి వెంకట బయపురెడ్డి

ప్రజాశక్తి - వేముల

మండలం లోని అన్ని గ్రామాలల్లో ఎంపిపి, జడ్‌పిటిసి నిధులతో మండల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపినట్లు వేముల ఎంపిపి చల్లా గంగాదేవి, జడ్‌పిటిసి వెంకట బయపురెడ్డి పేర్కొన్నారు. మండలలోని అన్ని పంచాయతీలలో పారిశుధ్యంపై అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జడ్‌పిటిసి అన్నారు. బుధవారం ఉదయం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం లోని సభాభవనంలో ఎంపిడిఒ రాధ కృష్ణవేణి అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, జడ్‌పిటిసి మాటల్లాడుతూ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు చొరవ తీసుకుని గ్రామాలలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎంపిపి, జడ్‌పిటిసి నిధులతో మండలంలో పలు అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ చట్టం ద్వారా పనులు కల్పించాలని సూచించారు. గ్రామాలలో వీధిలైట్లు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి మాట్లాడుతూ రైతు సోదరులు తప్పకుండా పంట నమోదు చేసుకోవాలని సూచించారు, రైతులకు సబ్సిడీ ద్వారా డ్రిప్పు స్పింక్లర్స్ అందిస్తున్నట్లు తెలిపారు. తహశీల్దార్ ఇందిరా రాణి మాట్లాడుతూ ఎక్కడైనా రెవెన్యూ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే వెంటనే పరిస్కరిస్తామని పేర్కొన్నారు. ఆర్డబ్ల్యు ఎస్ ఎఇ రమేష్ రెడ్డి మాట్లాడుతూ ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుక రావాలని కోరారు. విద్యుత్ శాఖ పై పలు సమస్యలు రావడంతో వెంటనే అధికారులు పరిష్కరించాలని ఎంపిడిఒ తెలిపారు. ప్రతి అధికారి తప్పకుండా సమయ పాలన పాటించాలని . ఎవరైనా విధులు పట్ల నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హౌసింగ్‌ఎఇ హరీష్ మాట్లాడుతూ బిసి, ఎస్‌సిలు నివాస గృహాలు పూర్తికాకుండా అసంపూర్తిగా వున్నా లబ్దిదారులకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు, రూ. 50వేలు, ఎస్‌ఇలకు, రూ. 75 వేలు ఇస్తుందని ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగ పరుచు కోవాలని పేర్కొన్నారు. ఎపిఎం ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి డ్వాక్రా రుణాలు విరివిగా అందిస్తామని, సబ్సిడీ ద్వారా అందించే సోలార్లను ఉపయోగించుకోవాలి అన్నారు. పెండ్లూరు సర్పంచ్ నాగేళ్ళ పార్వతమ్మ ఉపాధి పనుల అవకతవకలపై సభలో వినతి పత్రాన్ని అందజేశారు, అవకతవకలను అరికట్టక పోతే కలెక్టర్ దృష్టికి తీసుకుపోతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి నరసింహారెడ్డి, నీలావతి, లక్ష్మీదేవి, కో- ఆప్షన్ సభ్యులు మండి మా పీరా, సర్పంచ్‌లు నాగేళ్ల పార్వతమ్మ, మూలి చెన్నారెడ్డి, రామాంజనేయరెడ్డి, రంగనాథం, సాకే రమంజనమ్మ, అర్జున్, మణికంఠ, అధికారులు, ఉద్యాన అధికారి రాఘవేంద్ర రెడ్డి, వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి, ఆర్‌అండ్‌బి ఎఇ గణేష్ కుమార్‌రెడ్డి, పిఆర్ ఎఇ అబ్దుల్లా, ఎపిఒ పుష్ప లత, ఐసిడిఎస్ అధికారులు హసీనా, పంచాయతీ సెక్రటరీలు, మండల స్థాయి అధికారులు , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధిలో అక్రమాలపై విచారించాలి

ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న రసూల్

ప్రజాశక్తి - లింగాల

ఉపాధి జాతీయ ఉపాధి చట్టంలో ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమలకు పాల్పడుతున్నారని వారి పై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ శ్రీనివాసరెడ్డికి బుధవారం పలువురు వినతి పత్రం అందజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం బుధవారం ఎంపిపి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఉపాధి హామీ చట్టంలో అవకతవకలు జరిగాయని ఆరోపించాచు. కూలీలు పనులకు వెళ్లకుండా పనులు చేసినట్లు వారికి బిల్లులు చెల్లిస్తున్నారని లింగాలకు చెందిన కో- ఆప్షన్ సభ్యుడు రసూల్, పలువురు ఎంపిటిసిలు పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా అక్రమాలు జరుగుతున్నాయని విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ అన్నారు మండల వైద్యాధికారిని సుభాషిణి మాట్లాడుతూ లింగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆధునిక పరీక్షలు చేసే ల్యాబ్ మంజూరైందని, వాటి నిర్మాణాలకు వారి స్థలంలో అనుమతులు లేకుండా నిర్మించిన పాల డెయిరీని వెలిదండ్లలోని వారి సొంత భవనంలోకి మారిస్తే ల్యాబ్ నిర్మించి మెరుగైన వైద్య సేవలను ప్రజలకు అందిస్తాం అన్నారు. నూతన ఇంటి నిర్మాణాలకు సంబంధించి బిసి, ఎస్‌సిలకు రూ. 50 వేలు, ఎస్‌టిలకు రూ. 75 వేలు ప్రభుత్వం నిధులు కేటాయించిందని హౌసింగ్ ఎఇ స్వర్ణలత తెలిపారు. ఎంపిపి రమాదేవి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు మండల అభివృద్ధి అధికారులు సహకరించి కలసి పని చేయాలని సూచించారు పలు కీలక శాఖ అధికారులు మండల సమావేశానికి గైర్హాజరయ్యారు. దీంతో సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఈశ్వరయ్య, పంచాయతీరాజ్ ఎఇ, మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

దీక్షలకు సంఘీభావం తెలియజేస్తున్న జిల్లా కాంగ్రెస్ నాయకులు

విశాఖ ఉక్కు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప : విశాఖపట్నంలో పిసిసి అధ్యక్షురాలు వైఎస్. షర్మిల ఉక్కు కార్మికుల కోసం చేస్తున్న ఆమరణ దీక్షలో డిసిసి అధ్యక్షులు విజయ జ్యోతి పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా విజయ జ్యోతి మాట్లాడుతూ విశాఖ ఉక్కు యాజమాన్యా నిధి నిరంకుశ ధోరణి. డిమాండ్ల సాధనపై కార్మికులు సమ్మె బాట పడుతుంటే కనీసం దిద్దుబాటు చర్యలకు దిక్కులేదు అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్న కనికరం కూడా లేదని పేర్కొన్నారు. దిక్కున్న చోట చెప్పుకోండనే తీరున యాజమాన్యం వ్యవహరిస్తోంది అన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ జిల్లా నుంచి ప్రొద్దుటూరు నియోజవర్గం సమన్వయకర్త ఇర్ఫాన్ బాష, జమ్మలమడుగు సమన్వయకర్త శివ మోహన్‌రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్, క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షులు సంజయ్ కాంత, కార్మిక శాఖ విభాగం జిల్లా ఉపాధ్యక్షులు ఫైరోజ్ బాషా పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** విశాఖ స్టీల్ ప్లాంట్ దీక్ష శిబిరంలో కార్మికులకు మద్దతుగా ఎపి పిసిసి ఛీఫ్ షర్మిలా ఆమరణ దీక్ష చేపట్టారు. దీక్షకు ప్రొద్దుటూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ ఇర్ఫాన్ బాషా సంఘీభావం తెలిపారు. విశాఖలో స్టీల్ ప్లాంట్ కార్మికుల కోసం పిసిసి ఛీఫ్ షర్మిల కలిసి ఇర్ఫాన్ బాషా దీక్ష చేపట్టారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో తొలగించిన రెండు వేల మంది కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆన్‌లైన్ ద్వారా పన్నులు చెల్లింపులు

ప్రజాశక్తి - ముద్దనూరు

ఇంటి,నీటి పన్నులు ,లైసెన్స్ రుసుం చెల్లింపులు వసూళ్లు ఇక నుంచి ఆన్ లైన్ ద్వారా మాత్రమే జరుగుతాయని ముద్దనూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మినరసింహులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇంటి, నీటి పన్నులు, లైసెన్స్ రుసుం వసూళ్లలో గతంలో ప్పులు చోటు చేసుకున్నాయని, అలా కాకుండా పారదర్శకంగా జరిగేందుకు ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ వెబ్ పోర్టర్ అమలు చేసిందన్నారు. దీని ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే వసూళ్లు చేస్తారన్నారు. ఇంటి యజమానులు తమ ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ అందజేయాలన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని కార్యదర్శి కోరారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - ముద్దనూరు

చిన్నదుద్యాల గ్రామంలో నీటి బోరు మరమ్మతులు విషయంలో మంగళవారం చోటు చేసుకున్న గొడవలో హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సిఐ దస్తగిరి తెలిపారు. సిఐ వివరాలు ప్రకారం.. చిన్నదుద్యాలలో మరమ్మతులకు గురైన నీటిబోరును భూమిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, భూమిరెడ్డి శ్రీనివాసరెడ్డి తయారు చేస్తున్న సమయంలో బోరెడ్డి మదన్ మోహన్ రెడ్డి, బోరెడ్డి లక్ష్మి రెడ్డి, బోరెడ్డి ప్రసాద్ రెడ్డి కలిసి అడ్డుకున్నారు.మాటా మాటా పెరిగి ఇరువురు గొడవ పడ్డారు.అదే సమయంలో బోరెడ్డి మదన్ మోహన్ రెడ్డి,బోరెడ్డి లక్ష్మి రెడ్డి,బోరెడ్డి ప్రసాద్ రెడ్డి మచ్చు కత్తితో భూమిరెడ్డి శ్రీనివాసరెడ్డిపై దాడి చేసి గాయ పరిచాడు. బాధితులు ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మంగళవారం జమ్మలమడుగు రహదారి లోని శివాలయం సమీపంలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రిమాండ్ తరలించినట్లు సిఐ చెప్పారు.

గండి క్షేత్రంలో ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు



ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రంలో మూడు రోజులు నుండి హనుమజ్జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం త్రికాల ఆరాధన, చతుస్థానార్చన, మన్యు సూక్త హోమం, పంచముఖ హనుమాన్ మూల మంత్రహోమం, స్నపన తిరుమంజనం, లఘు పూర్ణాహుతి చేపట్టి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజా స్వామిలు టిటిడి చేత పాంచరాత్రాగమ పండితులు బి.వి. రామానుజాచారులు శిష్య బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్పాలంకరణకు కుప్పం పంచాయతీ మాజీ ఎంపిటిసి కవిత, బందలకుంట ఈశ్వరరెడ్డి సహకరించారు. హనుమాన్ జయంతి వేడుకల్లో జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో నుండి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేయడంతో గండి క్షేత్రం కిటకిటాడింది. గండి క్షేత్రంకు విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

చాపాడు : మండల పరిధిలోని విశ్వనాథపురంలో వెలసిన శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో గురు, శుక్రవారం రెండు రోజుల పాటు హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పూజా కార్యక్రమాలు ఆలయ కమిటీ కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. గూడూరు రాఘవేంద్ర శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గురువారం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, అలంకారం సహస్రనామార్చన, హనుమాన్ జపములు ఉంటాయని తెలిపారు. గణపతి పూజ, పూణ్యావాహచనం, పంచకవ్యప్రోక్షణ మన్య సూక్తపారాయణ, గణపతి హోమం, నవగ్రహ పవమాన సూక్త హోమం, శ్రీసీతారామలక్ష్మణ సమేత హనుమాన్ హోమం, పూర్ణాహుతి, మహామంగళహారతి, తీర్థప్రసాదాల వినియోగం ఉంటుందన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. శుక్రవారం ఆటో, ట్రాక్టర్ వెనుకకు వేగంగా నడిపే పోటీలు, వృషభరాజులచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఎద్దుల యాజమానులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. రెండు రోజులపాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

హనుమజ్జయంతికి ఏర్పాట్లు

పులివెందుల టౌన్ : పట్టణంలోని పడమటి ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఆంజనేయ స్వామి జయంతి సందర్భంగా ఆలయాలను ముస్తాబు చేశారు. అలాగే అన్నదాన కార్యక్రమాలకు ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమంలో దాదాపు పదివేల మంది పైగా పాల్గొంటారని ఆలయ కమిటీ అంచనా వేశారు. అన్నదాన కార్యక్రమం అనంతరం పట్టణంలో భారీ ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు

మోడల్ డిఎస్‌సి పరీక్షను జయప్రదం చేయాలి : డివైఎఫ్‌ఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈనెల 28న నిర్వహించే మోడల్ డిఎస్‌సిని జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేరీ కుమార్, విశ్వనాథ్ తెలిపారు. బుధవారం ప్రొద్దుటూరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రొద్దుటూరులో కూడా మోడల్ డిఎస్‌సి పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. పరీక్ష ఎస్‌జిటి అభ్యర్థులకు మాత్రమేనని అన్నారు. ముఖ్యంగా డివైఎఫ్ఐ పోరాట ఫలితంగా రాష్ట్రంలో డిఎస్‌సి నోటిఫికేషన్ సాధించిందన్నారు. మోడల్ పేపర్‌ను ప్రముఖ విద్యావేత్త మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణ రావు చేత తయారు చేశారన్నారు. రాబోవు డిఎస్‌సి పరీక్షకు ఈ మోడల్ పరీక్ష ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎంట్రీ ఫీజు రూ. 50 చెల్లించాలన్నారు. జిల్లాలోని అభ్యర్థులు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే మోడల్ డిఎస్‌సి పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పూర్తి వివరాలకు 8008087023,6302257340కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. గాంధీ రోడ్డులో ఎమ్మెల్యే కార్యాలయం సందులో ఉన్న సృజన్ కోచింగ్ సెంటర్లో కూడా పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

ఆలయానికి గంట వితరణ

ప్రజాశక్తి - ముద్దనూరు : బొందలకుంట గ్రామంలోని ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన అతి పురాతనమైన బసవేశ్వర స్వామి శివాలయానికి బుధవారం బసవేశ్వర సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ మునిరెడ్డి అఖండ దీపాలు, గంట వితరణ చేశారు. రూ12వేలు విలువ చేసే12 కిలోల బరువు కల్గిన గంట, రూ25 వేలు విలువ గల 25కిలోల బరువు కల్గిన అఖండ దీప వస్తువులను ఆలయ అర్చకులు అనిల్ స్వామికి అందజేశారు .ట్రస్ట్ ద్వారా ఆలయానికి మరిన్ని సేవలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు నాగరాజు పాల్గొన్నారు.

నేడు బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-దువ్వూరు : హనుమజ్జయంతి పురస్కరించుకుని గురువారం మూడు వందలు బైకులతో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు అరవేటి హరికృష్ణ, అమ్మిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో సంఘీభావంగా సుమారు 300 వందల బైకులతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా పాల్గొనాలని పేర్కొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు

ప్రజాశక్తి-రామపురం

మండలంలో గల ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ రామకృష్ణుడు పేర్కొన్నారు. మండలంలోని 0 నుంచి 18 సంవత్సరాలు వయసు గల ప్రత్యేక అవసరాల గల పిల్లలను గుర్తించి వారికి ప్రభుత్వం కల్పించే అన్ని సదుపాయాలను వివరించి కల్పించినట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతులైన పిల్లల కోసం మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. భవిత కేంద్రంలో ప్రతి బుధవారం ప్రత్యేక అవసరాల పిల్లలకు కావలసిన ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతులైన పిల్లలను భవిత కేంద్రానికి పంపించాలని పిల్లలు తల్లిదండ్రులను కోరారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు వారి అంగ వైకల్యం ను బట్టి రూ. 6 వేలు, రూ. 10 వేలు రూ. 5 వేలు ప్రతి నేల సహాయం ప్రభుత్వం ఏర్పాటు చేస్తూ, అలవెన్స్‌ల రూపంలో తోడ్పాటు ఇస్తుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఐఇఆర్‌టి జమలులఖాన్, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఖాజీపేట ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా శివరామిరెడ్డి

ప్రజాశక్తి - ఖాజీపేట : ఖాజీపేట మండల తహశీల్దార్‌గా కమలాపురంలో పనిచేస్తున్న తహశీల్దార్ శివరామిరెడ్డి అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక్కడ పనిచేస్తున్న తహశీల్దార్ మహబూబ్ బాషాను బుధవారం రెవిన్యూ జిల్లా ఉన్నతాధికారులు బదిలీ చేశారు. తహశీల్దార్‌మహబూబ్ బాషాపై ఉన్నతాధికారులకు అధికంగా ఫిర్యాదులు అందడంతో పాటు ఆన్‌లైన్ భూ వ్యవహారాలకు సంబంధించి అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణల నేపథ్యంలో బదిలీ చోటుచేసుకుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న తహశీల్దార్ అయినా ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలందించాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

నేడు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి వర్ధంతి

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరులోని స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణంలో సుప్రసిద్ధ కథా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ విమర్శకులు, బోధకులు కేతు విశ్వనాథరెడ్డి రెండవ వర్ధంతిని గురువారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, రచయిత బొమ్మిశెట్టి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు వర్ధంతి కార్యక్రమం జరుగుతుందని, తెలుగు భాషాభిమానులు, కవులు, రచయితలు, చరిత్రకారులు, విద్యార్థులు, పుర ప్రజలు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

పాఠశాలల యాజమాన్యంపై
చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు : ప్రభుత్వ నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి యువజన సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు డిప్యూటీ డిఇఒ మీనాక్షికి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రగతిశీల విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ కత్తి ఓబులేసు మాట్లాడుతూ పట్టణంలోని కార్పొరేట్, ప్రయవేట్ పాఠశాలల యాజమాన్యం ఎటువంటి నిబంధనలు పాటించకుండా ఇష్టా రీతిలో వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. అప్రూవల్ లేకుండా భవనాలు నిర్మించుకొని పాఠశాలలు నడుపుతున్నారన్నారు. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు హాస్టల్స్ ఏర్పాటు చేసుకొని అన్ని విధాలా సదుపాయాలు ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని వాపోయారు. స్థానిక కొర్రపాడు రోడ్‌లోని సంగమేశ్వర స్కూల్ యాజమాన్యం ఒక అపార్ట్‌మెంట్ కట్టి అందులో ఓ భవనాన్ని చూపి అడ్మిషన్లు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. అక్రమంగా ఫీజులను రాబడుతున్నారన్నారు. ఇటువంటి పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని కోరారు. అధిక ఫీజులు వసూలు చేయకుండా కట్టడి చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు రమేష్, బయలు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి నగదు అందజేత

ప్రజాశక్తి - ఖాజీపేట : మండల పరిధిలోని కూనవారిపల్లె పంచాయితీ పత్తూరు గ్రామంలో నూతన చర్చి నిర్మాణానికి మైదుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండ కుంట్ల శ్రీరాములు లక్ష రూపాయల నగదును అందజేశారు. ఈ మొత్తాన్ని బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు చేతులమీదుగా మత పెద్దలకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఫయాజ్, మండల మైనారిటీ నాయకులు షేక్ హాజీ గౌస్, మహేష్ పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి నగదు అందజేస్తున్న నాయకులు